# నమస్తే తెలంగాణ
## ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ శుక్రవారం 12 ఏప్రిల్ 2024 | ADILABAD NIRMAL


## ఆదివాసుల చైత్రమాసం పూజలు



ఇంద్రాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న ఆదివాసులు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 11: ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో చైత్రమాసం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. గురువారం ఏజెన్సీలోని ఇంద్రవెల్లి మండల కేంద్రంలో వడగాం, సిరికొండ మండలంలోని మల్లాపూర్ గ్రామాలకు చెందిన ఆదివాసులు కుటుంబ సమేతంగా ఇంద్రాదేవి ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ఆవరణలో నైవేద్యాలు వండి మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివాసీ గిరిజనులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాల్లో ఎటు చూసినా భక్తుల రద్దీ కనిపించింది.

## 'సరస్వతి'కి నీటి విడుదల

సోన్, ఏప్రిల్ 11 : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సరస్వతి కెనాల్ ద్వారా మంగళవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఈనెల 8న 'నమస్తే'లో చి'వరి'కి తడి లేకపాయే..' అనే కథనం ప్రచురించగా స్పందించిన నీటి పారుదలశాఖ అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో సోన్, లక్ష్మణచాంద, మామడ, ఖానాపూర్, పెంబి మండలాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నమస్తే ఎఫెక్ట్



నీటితో కళ కళ లాడుతున్న సరస్వతి కెనాల్



శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు



బోథ్ : పిల్లలతో సెల్ఫీ తీసుకుంటున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఉట్నూర్ : అలింగనం చేసుకుంటున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్



ఆదిలాబాద్‌లో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# ఘనంగా రంజాన్

**ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేసిన ముస్లింలు**



ఖానాపూర్ : ఖానాపూర్‌లో భూక్యా జాన్సన్‌నాయక్

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలవ్యాప్తంగా పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్‌ను గురువారం అనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈద్గాల వద్ద సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మౌలానాలు ఖురాన్ సూక్తులు చదివి వినిపించారు. ముస్లింలు కరచాలనం చేసుకుంటూ ఒకరినొకరు ఆలయ్ బలయ్ చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ బందోబస్తును ఏర్పాటు చేసింది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్పీ గౌష్ ఆలం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిర్మల్‌లో ఎస్పీ జానకి షర్మిల, ఖానాపూర్ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, బోథ్‌లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఉట్నూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శుభాకాంక్షలు తెలిపారు.



ఎదులాపురం : ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎస్పీ గౌష్ ఆలం

# మూలనపడ్డ 104




నిర్మల్ టౌన్, ఏప్రిల్ 11 : దీర్ఘకాలిక (మధుమేహం,బీపీ) వ్యాధులతో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి ఉచితంగా మందులు అందించే 104 వాహనాలు మూలనపడ్డాయి. గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేసేవారు. జిల్లావ్యాప్తంగా నాలుగు వాహనాలు సేవలు అందించేవి. కాగా.. ఇందులో పనిచేసే సిబ్బందికి వేతనాలు రాకపోవడం, వాహనాల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో వాహనాలు మూలన పడ్డాయి. పాత వైద్య కార్యాలయంలో వాహనాలు ఉంచడంతో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పాడై పోతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలను వినియోగించకుండా ఉండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# బోనస్ ఏదీ?

- వరి రైతుకు మద్దతు ధరపై దక్కని రూ.500
- ఎన్నికల హామీని నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆశగా ఎదురు చూస్తున్న జిల్లా రైతాంగం

**మాట తప్పిన కాంగ్రెస్**



తూకం వేస్తున్న హమాలీలు

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 11 : నిర్మల్ జిల్లావ్యాప్తంగా ఈ యాసంగిలో 1.20 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే వరికి ప్రభుత్వం మద్దతు ధర గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.2,203.. గ్రేడ్-బి ధాన్యానికి రూ.2,185 ప్రకటించింది. జిల్లాలో 203 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్లను చేపడుతున్నది. అయితే మద్దతు ధరపై అదనంగా బోనస్ కలిపి గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.2, 703, గ్రేడ్-బి ధాన్యానికి రూ.2,685లను రైతు ఖాతాలో జమ చేయాలి. కానీ.. ప్రభుత్వం బోనస్ లేకుండానే మద్దతు ధర మాత్రమే చెల్లిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

**బోనస్ ఇవ్వాలి..**

ఈ యాసంగిలో వరి సాగుకు నీటి కొరత, కరెంట్ సమస్య, వాతావరణం అనుకూలంగా లేక పోవడంతో దిగుబడులు తగ్గినట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రధానంగా ప్రాజెక్టులు, చెరువులు, సాగునీటి బోర్లు, బావుల కింద సాగు తగ్గింది. గతంలో1.50 లక్షల వరకు సాగు కాగా.. ఈసారి 1.20 లక్షల ఎకరాలకే పరిమితం అయ్యింది. పెట్టుబడులు కూడా పెరిగినట్లు రైతులు తెలుపుతున్నారు. ఈ క్రమంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అది ఆచరణకు నోచుకోకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి రూ.500 బోనస్ ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

**ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు..**

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయి. ఇప్పటికే 125 కేంద్రాల్లో ధాన్యాన్ని సేకరించాం. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లిస్తున్నాం. రైతులు ప్రభుత్వం ప్రకటించిన బోనస్‌ను అడుగుతున్నారు. బోనస్‌పై ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు. ప్రభుత్వం ఆదేశాలు ఇస్తే అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

-నందిని, జిల్లా పౌర సరఫరాల అధికారి, నిర్మల్

**కాంగ్రెస్ మాట తప్పింది..**



అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ లీడర్లు క్వింటాలు ధాన్యానికి మద్దతు ధరపై రూ.500ల బోనస్ ఇస్తామని ప్రకటించారు. కొనుగోళ్లు ప్రారంభమైనా బోనస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడడం లేదు. మద్దతు ధర డబ్బులు మాత్రమే పడుతున్నాయి తప్పా.. బోనస్ పడడం లేదు. కాంగ్రెస్ సర్కారు వెంటనే బోనస్‌పై స్పష్టత ఇవ్వాలి.

- ఎగ్గాం గణేశ్, రైతు, ఓల

# విద్యతోనే నవ సమాజం



జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి రామన్న, బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఎదులాపురం, ఏప్రిల్ 11 : మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను ఉన్నతమైన విద్యతోనే సాధించవచ్చని, నవ సమాజాన్ని నిర్మించవచ్చని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. గురువారం జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి ఆత్రం సక్కుతో కలిసి పూలమాల వేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన బహుజన తత్వవేత్త జ్యోతిబా పూలే అని గుర్తు చేశారు. కులవృత్తులకు సామాజిక ఆర్థిక గౌరవాన్ని పెంపొందించేలా సత్యశోధక్ సమాజ్ వంటి కార్యక్రమాలను చేపట్టారన్నారు. జ్యోతిబా పూలే స్ఫూర్తితోనే కేసీఆర్ ప్రభుత్వం బీసీ గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రమేశ్, నారాయణ, రామ్‌కుమార్, ఆశన్న, శ్రీనివాస్, ఆసిఫ్ పాల్గొన్నారు.

# భాషా పండితుల నిరీక్షణ

**22 ఏండ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూపు**



నిర్మల్ టౌన్, ఏప్రిల్ 11 : నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులు, పీఈటీలకు ఉద్యోగోన్నతులు కల్పించకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ విద్యా సంవత్సరమే స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు కల్పించిన ప్రభుత్వం భాషా పండితుల విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నది. తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ మీడియంలో పని చేస్తున్న భాషా పండితులు, పీఈటీలు పదోన్నతుల కోసం 22 ఏండ్లుగా ఎదురు చూస్తున్నారు. ప్రతి సారి ప్రభుత్వం షెడ్యూలు ప్రకటించగానే తమకు న్యాయం జరుగుతుందని ఆశతో ఎదురుచూస్తున్న వీరికి నిరాశే ఎదురవుతున్నది. ఇప్పటికే చాలా మంది ఉపాధ్యాయులు పదోన్నతులు రాక పదవి విరమణ చేసినట్లు వారు వివరించారు. గతేడాది కేసీఆర్ సర్కారు భాషా పండితుల పదోన్నతుల ప్రక్రియపై చర్యలు తీసుకోగా.. కొందరు కోర్టును ఆశ్రయించడంతో నిలిచింది. జిల్లాలో 219 మంది భాషా పండితులు, పీఈటీలు పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు. జూన్ నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పదోన్నతులు కల్పించాలని కోరుతున్నారు.

**పదోన్నతులు కల్పించాలి..**



భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి. యూపీఎస్, ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న భాషా పండితులకు గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 పదోన్నతులు కల్పించాలి. అలాగే పీఈటీలకు పీడీలుగా పదోన్నతి కల్పించాలి. దీనిపై కోర్టును కూ డా ఆశ్రయించినం. తమ డిమాండ్‌లను కోర్టు న్యాయ సమ్మతమైందని ఫుల్‌బెంచ్ తీర్పు ఇచ్చింది. దీనిని ప్రభుత్వం అమలు చేయాలి.

-గంగాధర్, భాషా పండితుల సంఘం అధ్యక్షుడు, నిర్మల్

**ప్రభుత్వం స్పందించాలి..**



భాషా పండితులకు గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1గా పదోన్నతులు కల్పించాలని కోరుతున్నాం. ఇతర ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి భాషా పండితులకు మాత్రం అన్యాయం చేస్తున్నారు. ప్రతి ఎన్నికల్లో ప్రభుత్వం హామీలు ఇస్తున్నా అమలు చేయడం లేదు. రేవంత్‌రెడ్డి సర్కార్ తమకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

-రాజేశ్వర్, ఉపాధ్యాయుడు

# లక్ష్యానికి మించి..

- ఆదిలాబాద్ జిల్లాలోని మార్కెట్ యార్డులకు రూ.17.68 కోట్ల ఆదాయం
- పత్తి కొనుగోళ్లతోనే అధికం



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లు(ఫైల్)

ఆదిలాబాద్, ఏప్రిల్ 11(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది మార్కెట్‌లు లక్ష్యానికి మించి ఆదాయాన్ని సమకూర్చుకున్నాయి. జిల్లాలో రైతులు వానకాలంలో పత్తి, సోయా, కంది.. యాసంగిలో శనగ, జొన్న, నువ్వు, పల్లి, మక్క సాగు చేస్తారు. పంటలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు మద్దతు ధరతో కొనుగోలు చేస్తాయి. ప్రభుత్వ లైసెన్స్ కలిగిన వ్యాపారులు రైతుల వద్ద నుంచి పంటలను సేకరిస్తారు. కొనుగోళ్లు మార్కెట్ యార్డుల ఆధ్వర్యంలో కొనసాగుతాయి. మార్కెటింగ్ అధికారులు, సిబ్బంది కొనుగోళ్లను పర్యవేక్షిస్తారు. ఆన్‌లైన్ విధానంలో కొనుగోళ్లు జరుగుతుండగా.. కంప్యూటర్‌లు, సిబ్బందిని అందుబాటులో ఉంచడం, కాంటాలు సిద్ధం చేయడం, తేమ శాతం పరీక్షించేందుకు సిబ్బంది, హమాలీలు వంటి సౌకర్యాలను మార్కెటింగ్ అధికారులు చూసుకుంటారు. పంటలను విక్రయించడానికి వచ్చే రైతులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేస్తారు. తాగునీటి సౌకర్యం, వైద్యం, ఇతర సదుపాయాలను కల్పిస్తారు. కొనుగోళ్లను అధికారులు పర్యవేక్షిస్తారు. మార్కెట్ యార్డుల్లో పంట ఉత్పత్తులను సీసీఐ, మార్క్‌ఫెడ్, నాఫెడ్, ఆయిల్‌ఫెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు లైసెన్స్ వ్యాపారులు కొనుగోలు చేస్తారు. ఇందుకు వారు మార్కెటింగ్‌కు సెస్ కింద ఒక శాతం పన్ను చెల్లిస్తారు.

**లక్ష్యానికి మించి ఆదాయం**

ఆదిలాబాద్ జిల్లాలో ఐదు మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఆదిలాబాద్, బోథ్, జైనథ్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి మార్కెట్ యార్డుల్లో యేటా రెండు సీజన్‌లకు సంబంధించిన కొనుగోళ్లు జరుగుతాయి. గతేడాది మార్కెట్‌లవారీగా ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుని 2023-24 ఆర్థిక సంవత్సరం లక్ష్యాన్ని నిర్దేశిస్తారు. ఈ ఏడాది ఆదిలాబాద్ జిల్లాలో రూ.15.45 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా పంటల విక్రయాల మార్కెట్ యార్డులకు రూ.17.68 కోట్ల ఆదాయం వచ్చింది. ఎక్కువగా పత్తి విక్రయాల వల్ల సమకూరింది. జిల్లాలో గతేడాది వానకాలంలో 3.81 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా.. గతేడాది అక్టోబరు చివరి వారంలో ప్రారంభమైన కొనుగోళ్లు ఈ ఏడాది మార్చి మొదటి వారం వరకు విక్రయాలు జరిగాయి. సీసీఐతోపాటు ప్రైవేటు వ్యాపారులు ఐదు మార్కెట్ యార్డుల్లో కలిపి 20 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. సోయా, కందులు, శనగ విక్రయాల ద్వారా ఆదాయం సమకూరింది.

# నగదు పట్టివేత

జైనథ్(బేల), ఏప్రిల్ 11 : బేల మండలంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా రూ. ఒక లక్ష నగదును పట్టుకున్నారు. మహారాష్ట్రలోని కోర్పణ నుంచి కారు(ఎంహెచ్ 34 బీఎఫ్ 7409) నంబర్ గల వాహనం మహారాష్ట్ర పాఠన్‌బోరికి వెళ్తున్నారు. తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఎటువంటి పత్రాలు లేకుండా నగదును తీసుకెళ్తుండడంతో పట్టుకున్నారు. డబ్బులను సీజ్ చేసి ఎఫ్ఎస్‌టీ టీం సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

**తలమడుగు మండలంలో..**

తాంసి(తలమడుగు), ఏప్రిల్ 11 : తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఎటువంటి అనుమతి లేకుండా తరలిస్తున్న రూ. 90 వేలను పట్టుకున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు. కిన్విట్ నుంచి ఆదిలాబాద్‌కు మారుతి షిఫ్ట్‌కారు(ఎంహెచ్29ఏడీ1074)లో ప్రయాణిస్తున్న గంగాధర్, సీతారాంలు తీసుకెళ్తున్న రూ.90వేలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

# ఉపాధి కూలీలపై తేనె టీగల దాడి



కూలీలను పరామర్శిస్తున్న మాజీ మంత్రి రామన్న

జైనథ్(బేల)/ఎదులాపురం, ఏప్రిల్ 11 : ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని రేణిగూడ గ్రామంలో గురువారం ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. సుమారు 100 మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరికి స్థానికంగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి చికిత్స అందించారు. ఇందులో తీవ్రంగా గాయపడిన 40 మందిని రిమ్స్‌కు తరలించారు. ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో ఉపాధి కూలీలతోపాటు కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా.. విషయం తెలియడంతో రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కూలీలను మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌తో మాట్లాడి పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. తాగు నీరు, టెంట్, ఆటోచార్జీలు ఇవ్వకుండా కూలీలపై నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. కూలీ కట్ చేయకుండా పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి వెంట నాయకులు విజ్జగిరి నారాయణ, యాసం నర్సింగ్‌రావు, సతీశ్, భూమన్న, రాజేశ్, రమేశ్ ఉన్నారు. అలాగే రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీఆర్‌డీఏ పీడీ సాయన్నలు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వీరి వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, రిమ్స్ వైద్యులు సుమలత, వైద్యులు తదితరులు ఉన్నారు.